గ్రూపు -2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



రామంతాపూర్‌లోని పరీక్ష కేంద్రం

ఉప్పల్, రామంతాపూర్‌లో 7 పరీక్షా కేంద్రాలు

రామంతాపూర్: నేడు, 16న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న గ్రూప్–2 పరీక్షల కోసం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన 7 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్‌లో ప్రభుత్వ జేఎన్ పాలిటెక్నిక్ కళాశాల, గణేష్‌నగర్ ప్రిన్స్‌టన్ డిగ్రీ కళాశాల, శారదానగర్, ప్రిన్స్‌టన్ పీజీ కళాశాల, శారదానగర్, వాగ్దేవి డిగ్రీ కళాశాల ఇందిరానగర్, క్రాంతి డిగ్రీ కళాశాల ప్రగతినగర్, మెగా మహిళా డిగ్రీ కళాశాల ప్రగతినగర్, మెగా మహిళా జూనియర్ కళాశాల ప్రగతినగర్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. మొదటి సెషన్స్ పేపర్–1 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మూడు గంటల నుంచి 5.30 గంటల వరకు ఉంటుందని పేర్కొన్నారు. మొదటి సెషన్ అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి ఉదయం 8.30 రావాలని, 9.30 తరువాత నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించమని, స్పష్టం చేశారు. రెండో సెషన్ అభ్యర్థులు కూడా 1.30 వరకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

రూ.50 లక్షలతో అభివృద్ధి పనులు

బోడుప్పల్: అభివృద్ధే ధ్యేయంగా ముందుకుసాగుతున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ 2వ డివిజన్ పరిధిలో శనివారం రూ. 50 లక్షలతో బీటీరోడ్డు పనులు, 28వ డివిజన్ పరిధిలో శ్రీసాయి ఎన్‌క్లేవ్‌లో కాలనీ కమాన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నగర ప్రజలకు మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ప్రారంభించిన పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, చీరాల నర్సింహ్మా, కో- ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్నగౌడ్, నాయకులు కొత్త రవిగౌడ్, కొత్త ప్రభాకర్‌గౌడ్, కుర్రి శివశంకర్ తదితరులున్నారు.



శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బోడుప్పల్: 26వ డివిజన్‌కు చెందిన ఆంజనేయులుకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు మంజూరైంది. శనివారం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డి ఆయనకు అందజేశారు. ఇన్‌చార్జి రాసాల మహేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి పన్నాల జంగారెడ్డి, శ్రీహరి పాల్గొన్నారు.

మల్కాజిగిరి: ఓల్డ్ మల్కాజిగిరికి చెందిన నిహారిక చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన రూ. 2 లక్షల ఎల్‌ఓసీని ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అందజేశారు. సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు అత్యవసర సమయంలో ఉపయోగపడుతుందన్నారు. మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, సతీష్, చిన్నయాదవ్, జనార్దన్ పాల్గొన్నారు.



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న సంజీవ్‌రెడ్డి



ప్రారంభోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న మేయర్ అమర్‌సింగ్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సంక్షేమ హాస్టళ్లలో..

ప్రారంభమైన కామన్ డైట్

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నూతన కామన్ డైట్ ప్రారంభం కాగా ప్రభుత్వ ఉన్నతాధికారులు పరిశీలించారు. శనివారం పౌష్టికాహారంపై 40 శాతం చార్జీలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు హాస్టళ్లలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల, కళాశాలలో వసతుల కల్పన, తదితర సౌకర్యాలను సమీక్షించారు.

– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఐఏఎస్ అధికారి ప్రియాంక



పరిశీలిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్



వంపుగూడలోని ఎస్సీ గురుకుల హాస్టల్‌లో..



మాట్లాడుతున్న జ్యోతి బుద్ధ ప్రకాష్

చిత్రలేఖన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గౌతంనగర్: లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320–సీ ఆధ్వర్యంలో గత నెలలో లిల్లీ మోడల్ స్కూల్‌లో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు ప్రత్యుష్ కుమార్ సాహూ, అక్షయ, రక్షిత, పీయూష్‌లకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి

కాప్రా: సాయిరాంనగర్‌లోని అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటన సందర్భంగా సాయిరాంనగర్ కాలనీని సందర్శించారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, సీసీరోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఎలక్ట్రికల్‌పోల్స్, వీధి దీపాల సమస్య కూడా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఓయూటీ కాలనీలో పర్యటించి పార్క్‌ను పరిశీలించి, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మూడు భాగాలుగా ఉన్న ఈ పార్క్‌ను ఒక్కటిగా చేసి థీమ్ పార్క్‌గా సుందరీకరించి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ బాలకృష్ణ, ఏఈ సూరజ్, జలమండలి ఏఈ రోహిత్, స్థానిక కాలనీవాసులు పాల్గొన్నారు.



ఓయూటీ కాలనీలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

సెమీ క్రిస్మస్ వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: ఏసు బోధనలు ఆచరణీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నాచారం పాస్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రేమ, కరుణ మానవాళిలో ఆనందం నింపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు సాయిజెనీశేఖర్, మేడల మల్లికార్జున్‌గౌడ్, ముత్యంరెడ్డి, భూపాల్‌రెడ్డి, కట్టబుచ్చన్నగౌడ్, పాస్టర్లు శ్యామ్‌సన్ స్వామి, విలియమ్, లాజరస్, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ వేదిక



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్

కుషాయిగూడ: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు చక్కటి వేదికలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడలోని మేడ్చల్ జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 24 బెంచీల్లో 456 సివిల్, 1,59,476 అన్ని రకాల క్రిమినల్ కేసులతో పాటుగా 381 ప్రీ లిటిగేషన్ కేసులకు పరిష్కారం చూపి రూ.13.1 కోట్ల పరిహారం చెల్లించినట్లు కోర్టు వర్గాలు ప్రకటించాయి. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు, జాతీయ లోక్ అదాలత్ సెక్రటరీ పంచాక్షరి, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్. రఘునాథ్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి విక్రమ్, జిల్లా సేవాధికార సంస్థ కార్యదర్శి కిరణ్‌కుమార్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, కుషాయిగూడ ఏసీపీ మహేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న సీపీఐ ఆవిర్భావ సభలు



కాప్రా: సీపీఐ పార్టీ ఆవిర్భావ సభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్ అన్నారు. మేడ్చల్‌జిల్లా పార్టీ కౌన్సిల్ సమావేశం శనివారం ఏఎస్‌రావునగర్ పార్టీ కార్యాలయంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిన సీపీఐ పార్టీ 99 ఏళ్లు పూర్తి చేసుకుందని, దేశవ్యాప్తంగా 100వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర, జిల్లా, గ్రామస్థాయిల్లో ఈనెల 26న ఎర్రజెండాలు ఎగరవేయాలని కార్యకర్తలకు సూచించారు. దామోదర్‌రెడ్డి, ఉమామహేష్, లక్ష్మి, దశరథ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

మల్లాపూర్: విద్యార్థులకు సృజనాత్మక ఆలోచనలు రావడం కోసం వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయని మల్కాజ్‌గిరి ట్రాఫిక్‌జోన్ ఏసీపీ ఎంవీ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీలోని శ్రీనివాస్‌రావు మోడల్ హైస్కూల్లో వైజ్ఞానిక ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా మల్కాజ్‌గిరి ట్రాఫిక్ ఏసీపీ హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేసినందుకు పాఠశాల కరస్పాండెంట్‌ను అభినందించారు. గగన్‌యాన్ మోడల్, రోబో,హైడ్రాలిక్ బ్రిడ్జి,ట్రాఫిక్ ఎడ్యుకేషన్ మోడల్స్ నమూనాలు పలువురిని ఆకట్టుకున్నాయి. స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్‌రావు, డైరెక్టర్ లక్ష్మీసత్య, స్కూల్ ఇన్‌చార్జ్‌లు రాజ్యలక్ష్మి, మురళీకృష్ణ, బ్రహ్మయ్య, ప్రసన్న, అనురాధ, ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ జోన్ ఏసీపీ శ్రీనివాస్‌రావు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



అనిల్ మృతదేహం

కుషాయిగూడ: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన శనివారం చర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా, రాయపర్తికి చెందిన అనిల్(22) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చాడు. చర్లపల్లి పారిశ్రామికవాడ, సురాన చౌరస్తాలోని బొమ్మల కంపెనీలో గత మూడేళ్లుగా పనిచేస్తూ.. ఆఫీసర్స్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శనివారం ఉదయం 9 గంటల సమయంలో తల్లిదండ్రులు పనికి వెళ్లగా.. అతడు ఇంట్లోనే ఉన్నాడు. ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో మృతుడి సోదరి స్నేహితురాలు వచ్చి తలుపు తట్టగా స్పందించకపోవడంతో కిటికీలోంచి చూడగా.. అనిల్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. భయాందోళనకు గురైన ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చింది. స్థానికుల సాయంతో కిందకు దించి చూడగా అప్పటికే అతడు మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురవీధుల్లో వేంకటేశ్వరస్వామి రథోత్సవం



ఆలయ చైర్మన్ రాజాగోపాల్ సైన్సర్ కరవాలతో విన్యాసాలు

అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించి పురవీధుల్లో రథోత్సవ యాత్ర చేపట్టారు. కోలాటాలు, భక్తిపరమైన పాటలు, ఆలయ వంశపారపర్య చైర్మన్ రాజా గోపాల్ సైన్సర్ కరవాలతో చేసిన విన్యాసాలు భక్తులను ఆకట్టుకుంది. ఆలయ వంశపారపర్య చైర్మన్ రాజాగోపాల్ సైన్సర్ దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి మఠం వీరేశం, వెంకట్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, శివరామకృష్ణ స్వామి, సురేందర్‌రెడ్డి, రాజనర్సింహారెడ్డి, రాజసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





స్వామివారి దర్శనం ఆంజనేయస్వామి

ప్రత్యేక అలంకరణలో స్వామివారు..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో మూలవిరాట్‌కు శనివారం వివిధ రంగుల్లో సుమారు 111 కిలోల కలకండ (పటిక బెల్లం)తో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో సంకటవిమోచన ఆంజనేయస్వామిని అర్చకులు తులసీరమణాచార్యులు ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

మల్లాపూర్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్, ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఆర్‌టీయూ జెండా ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డీపీఎస్ పనిచేసే వారికోసం డీపీఎస్ యాజ మమాన్యంతో మాట్లాడి మెరుగైన వేతనం, ఆరోగ్యబీమా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, నారాయణ, వేముల మారయ్య పాల్గొన్నారు.

దత్తాత్రేయ జయంతి వేడుకలు



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ, వేంకటేశ్వరనగర్‌లోని షిరిడీ సాయిబాబా ఆలయంలో శనివారం దత్తాత్రేయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, సంస్థాన్ అధ్యక్షుడు నాదంచారి, సెక్రటరీ రాజారావు, పాండు, వీరభద్రరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా లిటిల్ ఫ్లవర్ స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవాల్లో పాల్గొన్న మాంట్ ఫోర్టు బ్రదర్స్

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు ఘనంగా జరిగాయి. పూర్వ విద్యార్థులంతా కలిసి విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి సందడి చేశారు. కళాశాల విద్యార్థులచే నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. దేశభక్తి గీతాలు, సంప్రదాయ నృత్యాలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్రదర్ డియోన్లీ టఫారెల్లో మాట్లాడుతూ.. ఐదు దశాబ్ద కాలంలో ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దిన ఘనత లిటిల్ ఫ్లవర్‌కు దక్కిందన్నారు. ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు సినీ, రాజకీయ నేతలను అందించిదని చెప్పారు. ప్రిన్సిపల్ బ్రదర్ అరుణ్ ప్రకాశ్ మాట్లాడుతూ.. 1974లో కేవలం 150 మంది విద్యార్థులతో అబిడ్స్ చిరాగ్ అలిలైన్‌లో ప్రారంభమైన విద్యాసంస్థ నేడు వటవృక్షంలా మారిందన్నారు. ఈ స్వర్ణోత్సవాలు రెండేళ్ల పాటు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఎంతో మంది విద్యార్థులను మరింత ఉన్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యంగా విద్యాసంస్థ పనిచేస్తోందన్నారు. ఐఏఎస్ అధికారి శషాంక్ , సినీ హీరో తరుణ్, జాన్ కల్లర్కల్, ఫ్రాంకి నరోన, బ్రదర్ విన్సంట్‌రెడ్డి, బ్రదర్ జైకో, ఇతర మాంట్ ఫోర్టు బ్రదర్స్, పూర్వ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

కుషాయిగూడ: ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని కోరుతూ మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ నేతలు శనివారం ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డా. హామీమ్‌అక్తర్‌కు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేస్తూ.. వర్గీకరణను వెంటనే చేపట్టాలని కోరినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య తెలిపారు. ఇంజ మల్లేష్, యాకయ్య, లాజర్, బాబు, జయరాజ్ తదితరులున్నారు.

మానవత్వం చాటుకున్న ఇన్‌స్పెక్టర్

ఉప్పల్: ఆకలితో అలమిటిస్తూ స్పృహ కోల్పోయిన ఓ వృద్ధురాలికి ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. ఉప్పల్ సికింద్రాబాద్ బస్‌స్టాప్ వద్ద ఫుట్‌పాత్‌పై కాశవ్వ సాయం కోసం ఎదురు చూస్తూ.. తన బాధను ఎవరికీ చెప్పుకోలేక రోడ్డుపైనే పడిపోయింది. గమనించిన స్థానికులు 108కు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో సమాచారం అందుకున్న ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని వృద్ధురాలికి సపర్యలు చేసి నీరు తాగించి కూర్చోబెట్టారు. ఆకలితో అలమటిస్తున్న ఆమెకు అన్నం పెట్టించి సైదాబాద్‌లో ఉంటున్న కుమారుడికి సమాచారం ఇచ్చి తల్లిని అప్పగించారు. బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పిన ఆమె స్పృహ తప్పి పడిపోయిందని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ప్రణాళిక లేని రోడ్డుతో అవస్థలు !

ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్

రామంతాపూర్ : ప్రధాన రహదారి పెద్ద చెరువుకు ఎదురుగా ఉన్న ప్రగతినగర్ ముఖద్వారం పక్క లేన్‌లో దాదాపు రూ.15 లక్షలతో ఏడాది క్రితం నిర్మించిన రోడ్డును జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రణాళిక లేకుండా నిర్మించారనే ఆరోపణలున్నాయి. స్తంభాలు, ఇతరత్రా కట్టడాలను తొలగించకుండానే రోడ్డు వేశారని దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖాళీగా రోడ్డుపై బైక్‌లు , ఆటోలు, కార్లు తదితర వాహనాల అక్రమ పార్కింగ్‌కు అడ్డాగా మారిపోయింది. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వాహనాల పార్కింగ్ అడ్డాగా మారిన రోడ్డు

కుష్ఠు, క్షయ నిర్మూలనకు విశేష కృషి



కుషాయిగూడ: కుష్ఠు, క్షయ వ్యాధుల నిర్మూలనకు లెప్రాసొసైటీ విశేష కృషి చేస్తుందని సంస్థ సీఈఓ ప్రశాస్త్‌కుమార్‌నాయక్ అన్నారు. 'బ్లూ పీటర్ పబ్లిక్ హెల్త్ అండ్ రీసెర్చ్' (బీపీహెచ్‌ఆర్సీ) సహకారంతో పనిచేస్తున్న లెప్రా సంస్థ 25 ఏళ్ల వేడుకలను శనివారం చర్లపల్లి పారిశ్రామికవాడలో నిర్వహించారు. గ్యాస్ కంపెనీల కార్మికులు, విద్యార్థులు, నర్సింగ్ కళాశాలల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కుష్ఠు, క్షయతో పాటు హెచ్ఐవీ, ఫైలేరియా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. కోవిడ్ సమయంలో అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. బీపీహెచ్‌ఆర్సీ వ్యవస్థాపక డైరెక్టర్ డా. సుజై సునీత, ఐఎల్‌సీ ప్రెసిడెంట్ డా.నరసింహారావు, బీపీహెచ్‌ఆర్సీ ఇన్‌చార్జి మైఖేల్ సుకుమార్, డీన్ డాక్టర్ అపర్ణ శ్రీకాంతం తదితరులున్నారు.